بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V 26.04.2024 (Telugu)**

# హమ్‌రాఉల్ అసద్ యుద్ధం ఆదారంగా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర మరియు గౌరవనీయ అనుచరుల అభిమానపూర్వక త్యాగాల విశ్వాసభరిత ప్రస్తావన,

హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 26.04. 2024 తేదీన - మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, లండన్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము

أَشۡهَدُ أَنۡ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحۡدَهٗ لَا شَرِيۡكَ لَهٗ وَأَشۡهَدُ أَنَّ مُحَمَّدًا عَبۡدُهٗ وَرَسُوۡلُهٗ أَمَّا بَعۡدُ فَأَعُوۡذُ بِاللّٰهِ مِنَ الشَّيۡطٰنِ الرَّجِيۡمِ۔
بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ۔ اَلۡحَمۡدُ لِلّٰهِ رَبِّ الۡعٰلَمِيۡنَ۔ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ۔ مٰلِكِ يَوۡمِ الدِّيۡنِ۔ إِيَّاكَ نَعۡبُدُ وَإِيَّاكَ نَسۡتَعِيۡنُ۔ اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ۔ صِرَاطَ الَّذِيۡنَ أَنۡعَمۡتَ عَلَيۡهِمۡ غَيۡرِ الۡمَغۡضُوۡبِ عَلَيۡهِمۡ وَلَا الضَّآلِّيۡنَ۔

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

హమ్‌రాఉల్ అసద్ యుద్ధంనకు గల కారణం మరియు దాని నేపథ్యం గత ఖుత్బాలో ప్రస్తావించబడెను. ఉహద్ యుద్ధం తర్వాత శత్రువులు మార్గ మధ్య నుండి తిరిగి మదీనాపై దాడి చేయాలని సంకల్పించిన కుట్ర తెలిసినప్పుడు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ అబూబకర్ (రజి), హజ్రత్ ఉమర్ (రజి)ను పిలువగా వారిద్దరు ఇట్లు వేడుకొనిరి. ఓ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం! శత్రువు మన పిల్లలపై దాడి చేయకుండా ఉండుటకు మనం శత్రువులను ఎదురించవలెను. కావున ఉదయం నమాజ్ తర్వాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రజలను పిలుపించుకున్నారు. హజ్రత్ బిలాల్ (రజి)తో ఇట్లు ప్రకటన చేయించారు. శత్రువుతో పోటీ పడుటకు బయలు దేరండి. నిన్న ఉహద్ యుద్ధంలో పాల్గొన్న వ్యక్తులు మాత్రమే ఇందుకు బయలు దేరవలెను. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ పతాకంను తెప్పించుకొని హజ్రత్ అలీకి అప్పగించారు. హజ్రత్ అబూబకర్ (రజి)కు ఇచ్చినట్లు మరొక కథనంలో గలదు. ఈ సందర్భంగా వారు స.అ.స. హజ్రత్ ఇబ్నె ఉమ్మె మక్తూమ్ (రజి) ను మదీనాలో తమకు బదులుగా నియమించారు.

చరిత్రకారులు ఇట్లు వ్రాశారు. శత్రువును వెంబడించుటకు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం బయలు దేరుటకు తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో వివేకంతో కూడిన విషయం. వివరాలు ఇట్లు గలవు. అధిక ప్రజల శక్తిని కూడబెట్టుకోకుండా బయలు దేరుట చాలా ప్రమాద కరమైన విషయమని దాంబికులు భావిస్తుండిరి. కాని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నిర్ణయం ఎంతో దూరదృష్టి కలిగి ఉండెనని తర్వాతి సంఘటనలు నిరూపించాయి. ఎందుకనగా దీని వలన అనంతరం అనేక ప్రయోజనాలు కలిగినవి. ఈ నిర్ణయం వలన ముస్లిం సైనికులకు చాలా ధైర్యం కలిగినది. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం సంకల్ప శక్తి, దృఢమైన నమ్మకం వలన దాంబికులు భయాందోళనకు గురైరి. మూడవ వైపు ఇస్లామీయ సైన్యం తమను వెంబడి

స్తున్నదని తెలుసుకున్న శత్రువులు వెలుగుతున్న తమ సాహసాల దీపములు ఆరిపోయినట్లు భావించారు. ఈ సందర్భంగా దాంబికుల నాయకుడు అబ్దుల్లాహ్ బిన్ ఉబై కూడ తనను తమ వెంట తీసుకెళ్లాలని అనుమతి కోరాడు. కాని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అతనికి అనుమతి ప్రసాదించలేదు.

మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రకటన తర్వాత క్షతగాత్రులైన అనుచరుల ఆదరాభిమానాలు ఏ విధంగా ఉండెననగా వారు తమ గాయాలను లెక్క చేయకుండా తమ ఆయుధాలను ధరిస్తు మరొకసారి బయలు దేరారు. హ్రజత్ ఉసైద్ బిన్ హుజైర్ (రజి)కు 9 గాయాలు అయ్యేను. వారు వాటికి మందు పెట్టుకోవాలని సిద్ధమగుతుండగా ఈ ప్రకటన వినగానే మందు పెట్టుకొనుటకు కూడ ఆగకుండా బయలు దేరిరి. బనూ సల్మా తెగ నుండి 40 మంది క్షతగాత్రులు బయలు దేరారు. ఇటువంటి స్థితిలో కూడ ఆదేశంను పాటిస్తు బయలు దేరుటను చూసి వారి క్షమాపణ కొరకు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దుఆ చేసిరి. తుఫైల్ బిన్ నూమాన్ (రజి)కు 13 గాయాలు తగిలెను. ఖరాస్ బిన్ అస్సుమ్మకు 10 గాయాలు, కాబ్ బిన్ మాలిక్‌కు 10 గాయాల కంటే ఎక్కువ, ఖుత్బా బిన్ ఆమిర్‌కు 9 గాయాలు తగిలెను. అయినను ముస్లింలు తమ ఆయుధాల వద్దకు పరుగెత్తారు. తమ గాయాలకు మందు పెట్టు కొనుటకు కూడ ఆగలేదు. అల్లాహ్ తఆలా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరుల ఇదే అభిమానం, ఉత్సాహంను నిరుపమాణమని తమ గ్రంథంలో ఇట్లు ప్రస్తావించెను. తద్వారా ప్రళయ దినం వరకు వారిపై అభిమానంతో కూడిన పుష్పములు పడుతుండును. అల్లాహ్ తఆలా ఇట్లు తెలిపెను. 'గాయపడిన తర్వాత కూడ అల్లాహ్‌ను ప్రవక్తను అనుసరించిన వారిలో సత్కార్యములు చేసి ధర్మబద్ధముగా వ్యవహరించిన వారికి గొప్ప ప్రతిఫలమున్నది.' ఇది హ్రజత్ అబూబకర్ (రజి), హ్రజత్ జుబైర్ (రజి) కూడ వర్తిస్తుందని హ్రజత్ ఆయిషా (రజి) ఉల్లేఖించారు.

ఈ యుద్ధంలో ఒక అదృష్టవంతులైన అనుచరులు హ్రజత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కూడ ఉండిరి. తమ తండ్రి ఆదేశంతో తమ తొమ్మిది సోదరీమణులను అలనా పాలనా చూసుకొనుటకు ఆగినందున యుద్ధంలో పాల్గొనలేక పోయిరి. ఆయా వివరాలు వారు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు తెలుపగా వారి ఈ ప్రేమానురాగాలతో నిండిన విషయాలను విని వారికి మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అనుమతించారు.

మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ముఖంనకు గాయాలుండగానే వారు స.అ.స. ఈ యుద్దం కొరకు బయలు దేరారు. నుదుట గాయముండెను. దంతాలు విరిగిపోయెను. రెండు పెదవులు లోపలి నుండి గాయపడెను. కుడి భుజంతో పాటు రెండు మోకాళ్లు గాయపడెను. హ్రజత్ తల్హా (రజి)కు 70 కంటే ఎక్కువ గాయాలుండెను. వారిట్లు తెలిపిరి. నేను నా గాయాల కంటే ఎక్కువ మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గాయాల పట్ల చింతిస్తుంటిని. ఒక కథనం ప్రకారం మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హ్రజత్ ఉమర్ (రజి)తో ఇట్లనిరి. ఇకముందు ఎన్నడు ఖురైష్‌లు మనతో ఇలా చేయలేరు. ఇలాగే మనం మక్కాను జయింతుము.

మరొక కథనం ప్రకారం ఇట్లన్నారు. మనం అస్వద్ శిల్పంను ముద్దాడుదుము.

ఈ యుద్ధంలో ఇద్దరు అన్సార్ సోదరులు హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ సహల్ (రజి) మరియు హజ్రత్ రాఫి బిన్ సహల్ (రజి) ల విధేయత ఆదర్శంగా కనిపిస్తుంది. వారు గాయాలుండగానే నడుచుకొంటూ ప్రయాణం మొదలు పెట్టిరి. వివరాలిట్లు గలవు. వారిద్దరు ఉహద్ యుద్ధం నుండి తిరిగి వచ్చినప్పుడు తీవ్రంగా గాయపడి ఉండిరి. వారిద్దరు సోదరులు హమ్రాఉల్ అసద్‌లో పాల్గొనాలనే మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశం వినగానే వారిలో ఒకరు మరొకరితో ఇట్లనిరి. అల్లాహ్ ప్రమాణంగా! మనం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి ఈ యుద్ధంలో పాల్గొనకపోయినచో ఎంతో కోల్పోతాము. అనంతరం ఇట్లనిరి. అల్లాహ్ ప్రమాణంగా మనం సవారీ అగుటకు మన వద్ద ఎలాంటి సవారీ లేదు, ఈ పనిని ఎలా పూర్తి చేయాలో కూడ మనకు తెలియదు. హజ్రత్ అబ్దుల్లాహ్ ఇట్లనిరి. నాతో బయలు దేరు. మనం నడుచుకొంటూ వెళ్దాం. హజ్రత్ రాఫి (రజి) ఇట్లనిరి. అల్లాహ్ ప్రమాణంగా! గాయాల వలన నేను నడవలేకపోతున్నాను. వారి సోదరుడు ఇట్లనెను. రా! మనం నెమ్మది నెమ్మదిగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వెళ్దాం. ఇలా వారిద్దరు నడుచుకొంటూ ప్రయాణం మొదలు పెట్టారు. వారిద్దరు అప్పుడు గాయాలతో బాధ పడుతుండిరి. కొంచెం మంచిగా ఉన్న వ్యక్తి ఎక్కువ గాయాలున్న వ్యక్తిని తన వీపు మీద ఎత్తుకునేవారు. కాని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వైపు నడుచుకుంటూ వెళ్లిరి. బలహీనత వలన ఒక్కోసారి వారు నడవలేక పోయేవారు. తుదకు ఇషా సమయంన వారిద్దరు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు చేరుకున్నారు. అనుచరులు అప్పుడు ఒక సమూహంగా కూర్చొని, నిప్పు కాల్చుతుండిరి. వారిద్దరిని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సేవలో ప్రవేశపెట్టబడెను. మీరెందుకు వెనుకబడిరని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారిద్దరిని అడిగిరి. వారిద్దరు ఇందుకు గల కారణాలు, వివరాలు వెల్లడించిరి. వారిద్దరికి మేలు కలిగించే దుఆ చేస్తూ ఇట్లనిరి. మీరిద్దరికి ఆయువు ఎక్కువ లభించినచో మీకు అశ్వములు, గాడిదలు, ఒంటెలు సవారీగా లభించుటను మీరు చూచెదరు. కాని అవి మీరిద్దరి ఈ ప్రయాణం కంటే గొప్పగా ఉండవు. అనగా ఇప్పుడు నడుచుకొంటూ వచ్చిన ఈ ప్రయాణం కంటే అవి గొప్ప కావు. అనగా మీ ఈ ప్రయాణ పుణ్యం ఆ కాలపు గొప్ప వరములకంటే ఎక్కువుండును. ఈ సంఘటన హజ్రత్ అనస్ (రజి), హజ్రత్ మౌనస్ ఫజాలా కుమారులకు సంబంధించినదని కూడ అంటారు. వీరిరువురితో ఈ సంఘటన సంభవించినది కావచ్చును.

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) ఇట్లు ఉల్లేఖించారు. ఈ యుద్ధంలో మా వద్ద సాధారణ ఆహారంగా ఖర్జూరములుండెను. హజ్రత్ సాద్ ఉబాదహ్ (రజి) 30 ఒంటెలు, ఖర్జూరములు తీసుకొని వచ్చిరి. ఇవి హమ్రాఉల్ అసద్ వరకు మాకు మంచిగానే సరిపోయినవి. కొన్ని సార్లు ఒంటె మాంసం సేవించేవారం. సైనికులు ఎక్కువగా ఉన్నారని తెలుసుటకు, శత్రువు భయపడాలని రాత్రి పూట ఎక్కువగా అగ్ని దీపములను వెలిగించేవారము.

ఈ సందర్భంగా మాబద్ బిన్ అబూ మాబద్ ఖజాజి ప్రస్తావన కూడ లభిస్తుంది. అతడు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో భేటీ అయ్యెను. ఖురైష్‌ను కూడ ఇస్లాం సైన్యం గురించి భయపెట్టించెను. అతడు అప్పటికి ఇస్లాం స్వీకరించక అన్యారాధకుడిగానే ఉండెను. అతడు అబూసుఫ్యాన్ సమక్షంలో ఇస్లాం సైన్యంను ఎక్కువగా కీర్తిస్తు ఎలా ప్రస్తావించాడనగా అబూసుఫ్యాన్ అతని సహచరులు భయాందోళనకు గురైరి. వారు ధైర్య సాహసాలు కోల్పోయి భయానికి లోనైరి. తమ సైన్యంను తీసుకొని ఎంత త్వరగా మక్కా చేరుకుంటే అంత మంచిదని అబూసుఫ్యాన్ భావించెను. అబూసుఫ్యాన్ వెళ్లిపోయిన విషయం తెలుసుకున్న తర్వాత మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అక్కడ మూడు రోజులు బస చేసిరి. అనంతరం వారు స.అ.స. తిరిగి మదీననాకు చేరుకొనిరి. ఒక కథణంలో ఇట్లు గలదు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఐదు రోజులు మదీనా బయట వుండిరి.

హజ్రత్ అబూఉబైదహ్ (రజి) ఇట్లనిరి. మదీనాకు తిరిగి రాక ముందే ముఆవియ బిన్ ముఘీరహ్ (రజి)ను మహా ప్రవక్త స.అ.స. బంధించి ఉండిరి. ఇతడు రహస్యంగా మదీనాలో ఉంటుండెను. మదీనా కదలికల గురించి శత్రువులకు వార్తలు అందిస్తుండెను. అతడు బంధించ బడినప్పుడు హజ్రత్ ఉస్మాన్ (రజి)తో ఆశ్రయం కోరెను. వారు (రజి) మనవి చేయడంతో ఇతడు మూడు రోజుల లోపు మదీనా విడిచి పెట్టి పోవాలని అతినికి ఆశ్రయమిచ్చిరి. కాని మూడు రోజుల తర్వాత కనిపించినచో హత్య చేయబడును. అతడు మూడు రోజుల తర్వాత కూడ మదీనాలోనే దాక్కొని ఉండెను. కావున మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ జైద్ బిన్ హారిస (రజి), హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ (రజి)తో ఇట్లనిరి. మీరు అతణ్ణి ఫలానా చోట దాగి వున్నట్లు పొందగలరు. కావున వారిద్దరు అతణ్ణి అక్కడే దాగి ఉన్నట్లు పట్టుకొని అక్కడే హతమార్చిరి. మరిన్ని సంఘటనలు తర్వాత తెలుపబడును. ఇన్‌షా అల్లాహ్.

అనంతరం హుజూరె అన్వర్ ఇట్లనిరి. ప్రపంచ పరిస్థితుల కొరకు దుఆలు కొనసాగి స్తుండండి. ప్రతి రకమైన నష్టం నుండి ప్రతి అహ్మదీని అల్లాహ్ తఆలా రక్షించుగాక!

ఖుత్బా చివరలో హుజూరె అన్వర్ ఫరాజ్ అహ్మద్ తాహిర్ గారు ఆఫ్ రబ్వా ఆస్ట్రేలియాలోని ఒక షాపింగ్‌మాల్‌లో అమరులైన విషయంను ప్రస్తావించారు. ఒక ఆస్ట్రేలియన్ వ్యక్తి కత్తితో దాడి చేసి వారిని హత మార్చెను. అమరుని సద్గుణాలను తెలిపిన తర్వాత ఇట్లు దుఆ చేసిరి. అల్లాహ్ తఆలా మృతుని స్థాయి అంతస్థులను పెంచుగాక! కుటుంబసభ్యులకు సహనం కల్పించుగాక!

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَأْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ وَالْبَغْیِ۔ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ۔ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*